ప్రజాశక్తి

గురువారం 6 నవంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అమ్మకానికి హౌసింగ్ బోర్డు స్థలం



ఎండాడ వద్ద అమ్మకానికి పెట్టిన హౌసింగ్ బోర్డు స్థలం

- ఎండాడ సత్సంగ్ వద్ద 9.13 ఎకరాలకు ప్రభుత్వం స్కెచ్
- రూ.కోట్లు విలువ చేసే స్థలాలను కారుచౌకగా కట్టబెట్టేయత్నాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని కూటమి సర్కారు ప్రభుత్వ స్థలాల విషయంలో వేలం, లీజు, అమ్మకం విధానాన్ని శరవేగంగా అమలు చేస్తోంది. విశాఖలోని ప్రైమ్ ఏరియాలోగల రూ.వందల కోట్ల విలువైన భూములను వేలం పేరుతో అమ్మకానికి పెట్టడం తాజాగా చర్చనీయాంశమవుతోంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే మధురవాడలోని కొండలు, కాపులుప్పాడ కొండ, రుషికొండ ప్రాంతాల్లో ఎకరాలకు ఎకరాలను 99 పైసలు చొప్పున ఒక్కొక్క ఎకరాను కట్టబెట్టిన వైనంపై వివాదం కొనసాగుతుండగానే ఎపి హౌసింగ్ బోర్డు స్థలాన్ని 'వేలం' వేసేందుకు సర్కారు సిద్ధమవుతుండటం గమనార్హం. విశాఖ నగరంలోని ఎండాడ సర్వే నెంబరు 13, 14ల్లో ఆ స్థలముంది. ఇంకా హౌసింగ్ బోర్డుకు చెందిన విశాఖలోగల 27 ఎకరాల భూమిని కూడా అమ్మకానికి పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

హౌసింగ్ బోర్డు మౌలిక స్వభావాన్ని దెబ్బతీసే విధానం

ఉమ్మడి రాష్ట్రంలో ఎపి హౌసింగ్ బోర్డు మధ్య తరగతి ఉద్యోగులకు ఇళ్ల నిర్మాణాలు చేయడంలో కీలకపాత్ర పోషించింది. హైదరాబాద్ మొదలుకొని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వరకూ ఇప్పటికీ ఎపి హౌసింగ్ బోర్డు ఇళ్లు ఉన్నాయి. రాను రాను ఎపి హౌసింగ్ బోర్డు స్థలాలను ప్రభుత్వమే అసలు ధర కంటే తక్కువకు 'వేలం' పేరుతో అమ్మకానికి పెట్టి సొంత పార్టీ కుభేరులకు కట్టబెట్టే ప్రణాళికతో కదులుతోంది. వేలం వేస్తే రూ.కోట్లు ప్రభుత్వానికి వస్తాయంటూ ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. విశాఖలోని ఎండాడ సత్సంగ్ మెయిన్ రోడ్డు (గీతం మెడికల్ కాలేజీ దారి)లో హౌసింగ్ బోర్డుకు చెందిన 9.13 ఎకరాలకు సంబంధించి ఈ విధంగానే తాజాగా స్కెచ్ వేసింది. సర్వే నెంబరు 13, 14ల్లోగల ఈ భూమిని ఐదు ప్యాకేజీల కింద విభజించి 'వేలం' మిగతా 2లో..



జగదాంబ దరి సూపర్ బజార్ వద్దనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సాగుతున్న తనిఖీలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై
ఎసిబి దాడులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, మధురవాడ, గాజువాక విలేకరులు

విశాఖ నగర పరిధిలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. సూపర్ బజార్ వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మధురవాడ, పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపైనా ఏకకాలంలో ఈ దాడులు సాగాయి. మూడు చోట్ల కలిపి లెక్కల్లో చూపని సుమారు రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఎసిబికి అందిన ఆరోపణలు, పిటిషన్లు ఆధారంగా ఈ దాడులు జరిగాయి. స్వాధీనం చేసుకున్న సదరు నగదు ఎవరికి చెందినదో ధ్రువీకరణ చేయాల్సి ఉందని ఓ అధికారి తెలిపారు. వివిధ రికార్డులు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్‌లో ఉల్లంఘనలు, రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉంచబడిన పత్రాలు, పార్టీలకు జారీ చేయని రిజిస్టర్డ్ పత్రాలు, నిషేధిత ఆస్తుల రిజిస్ట్రేషన్, నాన్-జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల అమ్మకాల రిజిస్టర్లు తదితర అంశాలపై ఈ దాడులు కొనసాగాయి.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

వార్త 2లో..

రాష్ట్ర భవిష్యత్తు కోసం భాగస్వామ్య సదస్సు

వార్త 2లో..

సమాజ మార్పునకు దోహదపడే పుస్తకాలు చదవాలి

వార్త 8లో..



హీమో డయాలసిస్ యూనిట్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి డోలా తదితరులు

డిజిటలైజ్ విధానంలో వైద్య సేవలు

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలు ఆరోగ్యంగా.. ఆనందంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దానిలో భాగంగానే వైద్య సేవలను యూనివర్సల్ డిజిటలైజ్డ్ విధానంలో ప్రజలకు చేరువ చేస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. సిఎస్ఆర్ కింద ఎన్‌టిపిసి సమకూర్చిన రూ.2 కోట్ల ఆర్థిక సహాయంతో కెజిహెచ్ నెఫ్రాలజీ విభాగంలో ఆధునికీకరించిన హీమో డయాలసిస్ యూనిట్‌ను ఆయన బుధవారం పున్ణప్రారంభించారు. ముందుగా యూనిట్ లోపల కలియతిరిగిన ఆయన రోగులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య విషయమై రూ.25 లక్షలతో సార్వత్రిక ఇన్సూరెన్స్ కల్పించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. కుప్పంలో సంజీవని పేరుతో పైలట్ ప్రాజెక్టు మిగతా 2లో..

విపత్తుల్లో చేతులెత్తేస్తున్న ప్రభుత్వం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజలకు ఇబ్బంది తలెత్తినప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చేతులెత్తేయడం చంద్రబాబు ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజలు, రైతుల పట్ల కూటమి ప్రభుత్వం కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బుధవారం మధ్యాహ్నం విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తుపాను వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకూ ఒక్క రూపాయి పరిహారం దక్కలేదన్నారు. బాబు తెస్తున్న అప్పంతా ఏమవుతోందని ప్రశ్నించారు. రైతు సంక్షేమాన్ని పూర్తిగా పక్కనపెట్టేశారన్నారు. ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించే విధానానికి స్వస్తి చెప్పి మరలా పూర్వపు పద్ధతిలో పంట ఇన్సూరెన్స్‌ను రైతులే కట్టాలన్న నిబంధనను తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఏం మేలు చేసిందో తెలపాలన్నారు. కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిందన్నారు. కనీస పోలీసు భద్రత మిగతా 2లో..

'హిందుజా' విస్తరణను పెండింగ్‌లో ఉంచండి

- ప్రస్తుత సమస్యలను పరిష్కరించండి
- సిఎం, డిప్యూటీ సిఎంలకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ హిందుజా పవర్‌ప్లాంట్ విస్తరణకు సంబంధించిన ఎంఒయును పెండింగ్‌లో ఉంచి, ప్రస్తుత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆ వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. విశాఖలోని హిందుజా థర్మల్ పవర్ ప్లాంటు ప్రస్తుతం 1050 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందని, దీనిని మరో 1600 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించడానికి, 800 మెగావాట్ల సామర్థ్యంగల రెండు కొత్త యూనిట్ల స్థాపనకు హిందుజా గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయు కుదుర్చుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అదనపు ప్లాంట్లు ఏర్పాటు, విస్తరణ ప్రజలకు, యువతకు, ఉపాధికి, విశాఖ అభివృద్ధికి ఉపయోగపడితే ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. సిపిఎం కూడా అటువంటి అభివృద్ధిని స్వాగతిస్తుందని తెలిపారు. అయితే, ఇప్పటికే విశాఖలోని హిందుజా థర్మల్ పవర్ ప్లాంటు కాలుష్యం వల్ల ప్రజలు తీవ్రవ్యాధుల బారినపడుతున్నారని గుర్తుచేశారు. గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమయ్యాయని అన్నారు. వ్యవసాయం దెబ్బతిందని, ముడి సరుకు, రవాణాకు ఈ పరిశ్రమ వినియోగిస్తున్న భారీ టిప్పర్లు, వాహనాల వల్ల ప్రమాదాలు, మరణాలు పెరిగాయని తెలిపారు. శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల వినికిడి శక్తి దెబ్బతింటోందన్నారు. వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. పరిశ్రమలో స్థానికులకు ఉపాధి కల్పించాలన్న అంశాన్ని హిందుజా పవర్‌ప్లాంటు యాజమాన్యం విస్మరించిందన్నారు. స్థానికేతరులతో పనిచేయించుకుంటోందని, వారికి కూడా కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని తెలిపారు. ఉపాధి భద్రత కరువైందన్నారు. ఈ ప్లాంట్ కాలుష్యం పిట్టవానిపాలెం, దేవాడ, నమ్మిదొడ్డి, పాలవలస, చేపలపాలెం, అప్పికొండ, పెద్దపాలెం, చిన్నపాలెం, నక్కవానిపాలెం, ముదుబాయి, పలికిలివానిపాలెం, బోసదొడ్డి తదితర గ్రామాలపై తీవ్ర ప్రభావం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అమ్మకానికి హౌసింగ్ బోర్డు స్థలం

వేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న భూమి చదరపు అడుగుకు రూ.80 వేలు చొప్పున, కొంచెం లోపలకుండే స్థలం చదరపు అడుగుకు రూ.65 వేలు చొప్పున రేటు నిర్ణయించారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో గజం రూ.2 లక్షలకు పైగానే ధర పలుకుతోంది. ఈ లెక్కన రూ.50 కోట్లుపైగా ధర పలకాల్సిన ఈ భూమిని తక్కువ ధరకే మార్కెట్‌లో వేలానికి పెట్టడంపై హౌసింగ్ బోర్డు సిబ్బందిలోనే చర్చనీయాంశంగా మారింది.

ఎపిఐఐసి నుంచి హౌసింగ్ బోర్డుకు భూమి : డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్

ఎండాడ సత్యంగ్ పక్కనగల స్థలాన్ని 2007లోనే హౌసింగ్ బోర్డు కొనుగోలు చేసినట్లు ఎపి హౌసింగ్ బోర్డు విశాఖపట్నం రీజియన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎపిఐఐసి వద్ద అనేక భూములను ఉమ్మడి రాష్ట్రంలో రూ.వందల కోట్లకు హౌసింగ్ బోర్డు కొందని, వాటిని ఇప్పుడు వేలానికి పెట్టామని, ప్రభుత్వ ఆదేశానుసారం ఆ ప్రక్రియ నడుస్తోందని వివరించారు.

'హిందుజా' విస్తరణను పెండింగ్‌లో ఉంచండి

చూపుతోందన్నారు. యాజమాన్యానికి లాభాపేక్ష తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదన్నారు. ఎపి కాలుష్య నియంత్రణ మండలి చేష్టలుడిగి చూస్తోందని తెలిపారు. విజయనగరం జిల్లా అంతకాపల్లి, అనకాపల్లి జిల్లా బయ్యవరం నుంచి హిందూజా ప్లాంటుకు భారీ లారీలు, ట్రక్కుల ద్వారా బొగ్గును తరలిస్తున్నారని, దీనివల్ల సబ్బవరం, పరవాడ, లంకెలపాలెం రోడ్ల పరిసర ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని పేర్కొన్నారు. రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు హిందుజా పవర్‌ప్లాంట్ వల్ల పర్యావరణానికి జరుగుతున్న హానిపై నిరసనలు తెలిపిన విషయాన్ని జగ్గునాయుడు గుర్తుచేశారు. ఈ స్థితిలో హిందుజా పవర్‌ప్లాంటు విస్తరణకు అనుమతించడమంటే ప్రజలను మరింత అగాధంలోకి నెట్టడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలకు, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. పవర్ ప్లాంట్ కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించాలన్నారు. స్థానికులకు ప్లాంట్‌లో 75 శాతం ఉపాధి కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. రోడ్డు మార్గం గుండా బొగ్గు తరలింపు ఆపి, ప్రత్యామ్నాయం చూడాలన్నారు. ప్రతి ఆరు నెలలకు సేఫ్టీ ఆడిట్ జరపాలని, కాలుష్య నియంత్రణ మండలిని అప్రమత్తం చేయాలని కోరారు.

డిజిటలైజ్ విధానంలో వైద్య సేవలు

అమలు చేస్తున్నామని, దశల వారీగా రాష్ట్రంలోని ప్రజలందరికీ డిజిటలైజ్డ్ వైద్య సేవలను చేరువ చేస్తామని చెప్పారు. కెజిహెచ్ నెఫ్రాలజీ విభాగంలో ఇప్పటికే 13 సబ్ యూనిట్లతో సేవలు అందుతున్నాయని, అదనంగా ఎన్‌టిపిసి సాయంతో మరో 10 కొత్త సబ్ యూనిట్లను సమకూర్చగలిగామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఎఎంసి పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ డాక్టర్ రవిరాజు, ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ సంధ్యాదేవి, కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ, సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆర్ఎంఒ డాక్టర్ శ్రీహరి, నెఫ్రాలజీ విభాగం ఇన్‌ఛార్జి హెచ్‌ఒడి డాక్టర్ రత్నప్రభ, ఎన్‌టిపిసి ప్రతినిధులు పాత్రో, ప్రకాశ్ పాల్గొన్నారు.

విపత్తుల్లో చేతులెత్తేస్తున్న ప్రభుత్వం : బొత్స

కల్పించలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుపతి, సింహాచలంలో ఇదే రకమైన ఘటనలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు.

ఘనంగా రాధాకృష్ణ మహోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ శ్రీ రాధాకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీచ్ గోకుల్ పార్కు వద్ద శ్రీ రాధాకృష్ణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణుల కలశ ప్రతిష్ట, సాగర తీరాన పాలు, పెరుగు యదు మేళ నిర్వహించారు. పూజలు చేశారు. నియోజకవర్గంలోని యాదవ సంక్షేమ సంఘం నాయకులు హాజరయ్యారు.

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, వియంఆర్‌డిఏ మాజీ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, ఎఎంసి మాజీ ఛైర్మన్లు యలమంచిలి సూర్యనారాయణ, పిన్నింటి వెంకటరమణ, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, ఎంపిటిసి కోరాడ రమణ, పిఏసిఎస్ అధ్యక్షులు జి.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, ఎస్ఎం.పురం గ్రామానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన తప్పెట గుళ్ళు, భీమిలి మండలం చిప్పాడ, కొసనవాని పాలెం గ్రామాలకు చెందిన మహిళా కళాకారుల కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

'ట్రావెల్ కా ముహూర్త్'కు ఆదరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ట్రావెల్ ఏజెన్సీ మేక్‌మైట్రిప్ 'ట్రావెల్ కా ముహూర్త్' మొదటి 6 రోజుల ముందస్తు విమాన ప్రణాళిక, విస్తృత గమ్యస్థాన వినూత్నత, ప్రీ మియం బసలకు నిరంతర ప్రాధాన్యతను సూచిస్తున్నాయని ఆ సంస్థ ఉత్తరాంధ్ర రీజియన్ హెడ్ రాజేష్ మాగోవ్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ సంవత్సరాంతపు విమానాల కోసం ముందస్తు బుకింగ్‌లు తక్కువ బేస్ నుండి రెట్టింపు కావడం అనేది బసకు సంబంధించి మంచి ప్రధాన సూచికగా పనిచేస్తున్నాయన్నారు. మెక్ మై ట్రిప్ ప్రీమియమైజేషన్,కేటగిరీ అనేవి వసతిలో కీలకమైన ముఖ్యాంశాలుగా ఉన్నాయన్నారు. దేశీయంగా,ప్రయాణికులు 6 రోజుల వ్యవధిలో దేశం అంతటా విమానాలను బుక్ చేసుకున్నారని తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం భాగస్వామ్య సదస్సు



ఎయు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి డోలా

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఈ నెల 14, 15వ తేదీల్లో విశాఖపట్టణం వేదికగా జరగనున్న ప్రపంచస్థాయి భాగస్వామ్య సదస్సు రాష్ట్ర భవిష్యత్తుకు తలమానికం కానుందని, దీనిని విజయవంతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవిరళ కృషి చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి, ఇతర కేబినెట్ మంత్రులు పలుదేశాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలను, పెట్టుబడి దారులను ఆహ్వానించా రని గుర్తు చేశారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుమారు 40పైగా దేశాల నుంచి అతిథులు విచ్చేస్తున్నారని తెలిపారు. సదస్సు నిర్వహించటం ద్వారా రాష్ట్రానికి రూ.9.8లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. 410 ఒప్పందాలు జరుగుతాయని, 2.7 లక్షల కోట్లతో ప్రాజెక్టుల శంకుస్థాపనలు కూడా జరుగుతాయని మంత్రి తెలిపారు. ఏర్పాట్లను జిల్లాకలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ వివరించారు. మంత్రితో పాటు ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు ఉన్నారు.

ఎంవిపి.కాలనీ: ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు చేపట్టిన పనులు జీవిఎంసికి చాలా ప్రతిష్టాత్మకమని, పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవిఎంసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీవిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అభివృద్ధి పనులతో పాటు జీవిఎంసి వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై జీవిఎంసి ప్రధాన ఇంజనీరు సత్యనారాయణరాజు, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఈ నెలలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు చేపడుతున్న అభివృద్ధి, నగర సుందరీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. సమావేశంలో జీవిఎంసి పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్, గోవిందరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల మనుగడ దెబ్బతీస్తారా ?

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : సాంప్రదాయ మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను విరమించాలని,సిఐఎఫ్ టియుఐ జాతీయ అధ్యక్షులు ఎస్.కనకారావు డిమాండ్ చేశారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సంప్రదాయ మత్స్యకారులు యూనియన్ ఆధ్వర్యంలో, అంతర్జాతీయ మత్స్యకార మహిళా దినోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిఆర్‌జెడ్ ఇంటెన్సివ్, ఇండస్ట్రియల్ ఆక్వాకల్చర్, ఆఫ్ షోర్ చమురు, గ్యాస్ వెలికితీత, పర్యాటకం, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పేరుతో తీరప్రాంత, సముద్ర దోపిడీ తీవ్రమవుతోందన్నారు. దీనివల్ల సాంప్రదాయ మత్స్యకారుల జీవన విధానం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల యూనియన్ అధ్యక్షులు కె.లక్ష్మి, కొర్రయ్య పాల్గొన్నారు.

డిసిపి-1గా మణికంఠ చందోలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2018 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన విఎన్.మణికంఠ చందోలు విశాఖపట్నం నగర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్-1 (లా అండ్ ఆర్డర్)గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు శాఖలో పలు ప్రాంతాలలో కీలక విభాగాలలో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. గతంలోనూ ఆయన విశాఖ డిసిపి - 1గా పనిచేశారు.

నేడు జెడ్‌పి స్థాయి సంఘ సమావేశాలు

విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు గురువారం ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగుతాయని, జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కొన్ని, ఛైర్ పర్సన్ చాంబర్ లో కొన్ని స్థాయి సంఘ సమావేశాలు జరుగుతాయని, 6, 3 స్థాయి సంఘ సమావేశాలు 10:30 గంటలకు, 4వ స్థాయి సంఘ సమావేశం 11 గంటలకు, 5వ స్థాయి సంఘ సమావేశం 11:30 గంటలకు, 6, 7,1 స్థాయి సంఘ సమావేశాలు 12 గంటలకు జరుగుతాయని తెలిపారు.

అలెన్ కెరీర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ: భారత దేశంలోని ఇంజనీరింగ్, వైద్య విద్య కోర్సుల ప్రవేశ పరీక్ష తయారీకి శిక్షణ ఇస్తున్న ప్రముఖ సంస్థ అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం (వైజాగ్)లో తన ఆఫ్‌లైన్ క్లాస్‌రూమ్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని ఉపాధ్యక్షుడు జోనల్ హెడ్‌మహేష్ యాదవ్ తెలిపారు. బీచ్ రోడ్‌లోని నోవోటెల్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఏ కారణం చేతైనా, అలెన్ తరగతి గది కేంద్రాలను చేరుకోలేని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇన్‌స్టిట్యూట్ తన శాఖలను నిరంతరం విస్తరిస్తూ వెళు తోందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సమన్వయకర్త సీతారాం నందూరి మాట్లాడుతూ, ' ప్రతి ఏడాది అత్యుత్తమ ఫలితాలతో, వేలాది మంది విద్యార్థులు అలెన్ సహకారంతో తమ కలలను సాకారం చేసుకుంటున్నారు. తరగతులు ఏప్రిల్ 2026 నుంచి మొదలవుతాయన్నారు. అలెన్, తమిళనాడు హెడ్ సంతోష్‌సింగ్, తెలంగాణ హెడ్ సౌరభ్ తివారీ, దక్షిణ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, ద్వారకా ఏసిపి అన్నెపు నరసింహ మూర్తి తదితరులు హాజరయ్యారు.

విశాఖ పోర్టు కార్యదర్శి వేణుగోపాల్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-ఎంవిపి. కాలనీ: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి. వేణుగోపాల్‌కు పారాదీప్ పోర్ట్ అథారిటీ డిప్యూటీ ఛైర్మన్‌గా పదోన్నతి పొందారు. ఆయనను పారదీప్ పోర్ట్ డిప్యూటీ ఛైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర పోర్టులు నౌకా జలరవాణాశాఖా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. వేణుగోపాల్ 1995లో విశాఖపట్నం పోర్టులో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2019లో ఆయన కార్యదర్శిగా పదోన్నతిపై దీన్ దయాళ్ (కాండ్లా) పోర్ట్ అథారిటీలో సేవలు అందించారు. 2020లో తిరిగి విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో కార్యదర్శిగా బదిలీ అయ్యి ఇప్పటివరకు సేవలు అందిస్తున్నారు. తన పదవీకాలంలో ఆయన బింస్టెక్, ఇండియన్ మేరీటైమ్ కాన్‌క్లేవ్‌లు, ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవం, అంతర్జాతీయ క్రూయిజ్ నౌకల విశాఖ పోర్ట్ సందర్శనలు వంటి అనేక ప్రధాన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.



వేణుగోపాల్

జనాభా గణన రాష్ట్ర పురోగతికి ఉపయుక్తం

సెన్సస్ డైరెక్టర్ నివాస్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జనాభా గణన రాష్ట్ర పురోగతికి ఉపయుక్తంగా ఉంటుందని సెన్సస్ డైరెక్టర్ జె.నివాస్ స్పష్టం చేశారు. జనాభా గణన అమలుపై నియమించిన 30మంది ఎన్యూమరేటర్లు, 9 మంది సూపర్‌వైజర్లకు బుధవారం జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నివాస్ మాట్లాడుతూ, ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జియో టాగింగ్ నిర్వహించాలని సూచించారు. వనరుల విభజన, అక్షరాస్యత, రాష్ట్ర అభివృద్ధి ఇతరత్రా అంశాల పురోగమనం అనేది జనాభా గణనపై ఆధారపడి ఉంటాయన్నారు. గుడారాల్లో ఉన్నా, ఫుట్ పాత్‌లపై ఉన్నా, అద్దె ఇళ్లల్లో ఉన్నా, వలస వచ్చిన వారైనా సరే ప్రతి ఒక్కరి వివరాలను లెక్కగట్టాలని సూచించారు. అభివృద్ధి సూచిక జనాభా గణన ఆధారంగానే ఉంటుందన్నారు. ఒక్కో వార్డులో 180 నుంచి 200 ఇళ్లను సందర్శించి ప్రయోగాత్మకంగా జన గణన నిర్వహించాలని చెప్పారు. ఏప్రిల్ 26వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో జన గణన ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. జివిఎంసి అదనపు కమిషనర్ రమణమూర్తి, సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్ దయాసాగర్, జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తది తరులు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జివిఎంసి 2, 3 వార్డులను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా జన గణన చేపట్టాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సెన్సస్ డైరెక్టర్ నివాస్

డివీస్ ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులతో డివీస్ జిఎం వైఎస్.కోటేశ్వరరావు

ప్రజాశక్తి- తగరపువలస : భీమునిపట్నం మండలం చిప్పాడ దివీస్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో మార్కులు ఆధారంగా 8వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం, మూలకుద్దు, గుడివాడ, టి.నగరపాలెం, లింగాలవలస, తుడెం, చెరుకుపల్లి పంచాయతీలకు చెందిన 111 మంది విద్యార్థులకు సుమారు రూ.6,17,500 విలువగల ఉపకార వేతనాలు అందజేశారు. సంస్థ కార్యాలయంలో జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్.రావు, డిజిఎం పి.జగదీష్ ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనం చెక్కులు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. ఎంఎస్ఎన్.రావు మాట్లాడుతూ, భవిష్యత్తు ప్రణాళిక ముందుగా నిర్ణయించుకొని దానికి తగిన విధంగా కృషి చేయాలని సూచించారు. ప్రతిరోజూ నూతన విషయాలను తెలుసుకోవడంలో ఆసక్తి చూపాలన్నారు. పి.జగదీష్ మాట్లాడుతూ చదువుకు మార్కులు మాత్రమే కొలమానం కాదని, తెలివితేటలు పెంపొందించాలని చెప్పారు. ఉపకార వేతనాలు అందించిన సంస్థకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డేటా సెంటర్ భూముల్లో సిపిఐ పరిశీలన

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో గూగుల్ డేటా సెంటర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన దళితుల అసైన్డ్ భూములను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ, 1971లో అప్పటి ప్రభుత్వం దళితులకు రెండెకరాల చొప్పున 48 కుటుంబాలకు సాగు చేసుకోవడానికి భూములు ఇచ్చి పట్టాలు జారీ చేసిందని తెలిపారు. ఆ భూముల్లో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో బోర్లు త్రవ్వి, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఆ భూములను డేటా సెంటర్ కోసం స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. రైతుల జీవనాధారాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఇప్పటికే అదాని కంపెనీకి డేటా సెంటర్ పేరిట 400 ఎకరాలు కేటాయించినప్పటికీ అక్కడ ఎటువంటి నిర్మాణమూ జరగలేదని గుర్తుచేశారు. ఆ భూములనే డేటా సెంటర్‌కు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎం.మన్మధరావు, వనజాక్షి, ఎమ్‌డి.బేగం, నెయ్యల నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అసెంబ్లీకి ఎంపికైన అక్షయకు అభినందనలు

ప్రజాశక్తి- ఆనందపురం: విద్యార్థి అసెంబ్లీకి ఎన్నికైన బోయపాలెం జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని బూస అక్షయను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 26వ తేదీన జరిగే విద్యార్థి అసెంబ్లీలో భీమిలి వాయిస్‌ను బలంగా వినిపించి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని అక్షయ తల్లిదండ్రులు, సర్పంచ్ వాసపల్లి ముత్యాలరావు, వైస్ సర్పంచ్ బొట్ట శ్రీను, ఎస్ఎంసి చైర్మన్ చల్లా రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఐవి.కొండబాబు, గైడ్ ఉపాధ్యాయులు పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి -యంత్రాంగం

రోలుగుంట:మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుచ్చంపేటలో మినీ కైలాసగిరి, రోలుగుంట గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి, జానకిరాంపురంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. దీపారాధన చేపట్టారు. కుసర్లపూడిలో పాకలపాడు గురు దేవుల ఆశ్రమం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం శివారు ఆదిరెడ్డి పాలెంలో గొంప దేముడు ఆధ్వర్యంలో సద్గురు కేప స్వామీజీ జ్ఞాన మందిరంలో కార్తీక పౌర్ణమి దీపారాధన మహోత్సవం జరిగింది. ఇందులో శ్రీయజ్ఞ వల్యరాజాశ్రమ పీఠాధిపతులు డాక్టర్ కృష్ణ చరణానంద భారతీ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీపారాధన, అన్న సమారాధన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో గండి దేముడు, సబ్బవరపు పైడమనాయుడు, సింగంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి బర్లపేట గ్రామంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మహా రుద్రాభిషేకం నిర్వహించారు. రూపాకుల విశాలాక్షి స్మృతి వనంలో రూపాకుల రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పద్మనాభం మండలంలోని విలస్‌ఖాన్‌పాలెం గ్రామంలో ఉన్న శివాలయం ప్రాంగణంలో బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఈ వ్రతంలో 30 మంది దంపతులు పాల్గొన్నారు.

సముద్ర స్నానాలు

భీమునిపట్నం : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు మహిళలు సముద్ర స్నానాలు చేశారు. సముద్ర స్నానాల సందర్భంగా భీమిలి సాగర తీరంలో ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా సిఐ బి.తిరుమలరావు, మెరైన్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ భరత్‌కుమార్ రాజు, సిబ్బంది, లైఫ్ గార్డులు, గజ ఈతగాళ్లతో పోలీసులు, మెరైన్ పోలీసులు బందోబస్తు చేపట్టారు. భీమిలి బీచ్ నుంచి చేపలుప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం వరకు ఏడు చోట్ల పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భీమిలి బీచ్‌ను బుధవారం సాయంత్రం విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి సందర్శించారు.

6న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి శ్రీనార్ద్ షిరిడి సాయిబాబా ఆలయంలో హెల్త్ సిటీలో ఉన్న శ్రీ సత్య హెల్త్ సెంటర్ గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనుంది. ఈ శిబిరంలో ఉచితంగా మధుమేహం, రక్తపోటు పరీక్షలతో పాటు సాధారణ వైద్య సేవలు అందించి, అవసరమైన మందులు పంపిణీ చేస్తామని ఆస్పత్రి ఎమ్‌డి, గైనకాలజిస్ట్ డాక్టర్ శోభ తెలిపారు. ఈ శిబిరం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, ముడసర్లోవ, ఆరిలోవ పరిసర ప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం గ్రామంలోని బాలుర వసతి గృహంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపిపి నిధులతో కొత్త బోరు ఏర్పాటుకు వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ చందక లక్ష్మి బుధవారం శంకుస్థాపన చేశారు. తదుపరి బుడగ జంగాల కాలనీలో కూడా బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

ఇంగ్లీషు గెస్ట్ ఫ్యాకల్టీకి 7న ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈ నెల 7వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పి.శ్రీవాణి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, ఒక సెట్ జెరాక్స్ కాపీలతో 7వ తేదీ ఉదయం 10.00 గంటలకు కళాశాలకు హాజరుకావాలని కోరారు. ఎంఎ ఇంగ్లీష్, ఎపి సెట్ ఉత్తీర్ణత, పిహెచ్‌డి కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8978883125 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పకడ్బందీగా దీపోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : శ్రీ అనంతపద్మనాభ స్వామి గిరి దీపోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 19న పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పద్మనాభంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి గిరి దీపోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో భక్తులతో ప్రత్యేక సమావేశాన్ని ఆలయం ఇఒ నరసింహరాజు ఆధ్వర్యంలో కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఈ ఏడాది జరగనున్న దీపోత్సవానికి గతం కంటే 50 శాతం భక్తులు పెరగనున్నారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పోలీస్ శాఖ నిఘా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, టిడిపి మండల అధ్యక్షులు కె.రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదర, పద్మనాభం సర్పంచ్ టి.పాప, స్థానిక సిఐ సిహెచ్.శ్రీధర్, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన గురువారం సాయంత్రం బిఆర్‌టిఎస్ రహదారి పైనాపిల్ కాలనీ వద్ద చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని గురుద్వారా ప్రాంతానికి చెందిన ఆలేటి సూర్యనారాయణ (65) గురువారం ఉదయం పైనాపిల్ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో ఉన్న తన బంధువుల ఇంటికి వచ్చారు. సాయంత్రం తిరిగి తన ఇంటికి వెళ్లే క్రమంలో బిఆర్‌టిఎస్ రహదారి పైనాపిల్ కాలనీ వద్ద రోడ్డు దాటుతున్నారు. ఆ సమయంలో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వస్తున్న బైక్‌స్ట్ రహదారి దాటుతున్న సూర్యనారాయణను బలంగా ఢీకొట్టాడు. సూర్యనారాయణ తలకు బలంగా గాయమై, రక్తపు మడుగులో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి -తగరపువలస: జివిఎంసి 1వ వార్డు పరిధిలోని రెండిళ్లలో బంగారు ఆభరణాల దొంగతనాలకు పాల్పడిన నిందితులను భీమిలి పోలీసులు అరెస్ట్ చేసి 8 తులాలు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి లతా మాధురి, ఎసిపి ఎ.నరసింహమూర్తి వివరాలు వెల్లడించారు. తగరపువలస రామన్నపేట సమీపంలోని రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు అక్టోబర్ 12వ తేదీన భీమిలి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆసుపత్రి పనిమీద వెళ్లి ఇంట్లో బీరువాలో బంగారం దాచిపెట్టామని, ఇంటికి వచ్చాక ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని కాకి కాంత ఫిర్యాదు చేశారు. అదే ప్రాంతానికి చెందిన రాలి వరలక్ష్మి ఇంట్లో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆమె ఫిర్యాదు చేశారు. రెండు కేసులకు సంబంధించి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాశరావు దర్యాప్తు చేపట్టి చోరీకి పాల్పడింది మహిళగా గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకొని ఆమె నుంచి 8 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన ఎస్ఐ సూర్యప్రకాశరావును, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

పేకాట శిబిరాలపై దాడి

- వేర్వేరు చోట్ల 15 మంది అరెస్టు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలంలోని పులపర్తి గ్రామ శివారులో పేకాట శిబిరంపై యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర బృందం దాడి చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు చేసిన ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుండి రూ.5380 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాయకరావుపేట : మండలంలోని మంగవరం గ్రామ శివారులో బుధవారం ఒక పాకలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మంగవరం గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుండి రూ.5,940 నగదు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ జి.అప్పన్న తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సిఐ సెల్ నెంబరు 9440796106 గాని 112కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

స్పా ముసుగులో వ్యభిచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని సిరిపురం విఐపి రోడ్ సమీపంలో ఉన్న ఆర్కిడ్ వెల్‌నెస్ అండ్ స్పా సెంటర్‌లో వ్యభిచారం నడుస్తోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, మూడో పట్టణ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. సెంటర్ నిర్వాహకులు/మేనేజర్‌లుగా వ్యవహరిస్తున్న కల్లూరు పవన్ కుమార్, జానా శ్రీనివాస్‌లతో పాటు చీలి రామచంద్ర ప్రసాద్‌ను అరెస్టు చేశారు. తదుపరి విచారణ చేశారు. థాయ్ స్పా మసాజ్ పేరుతో డబ్బు కోసం మహిళలను లైంగిక దోపిడీకి ఉపయోగిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఘటనా స్థలంలో ఉన్న మూడు మొబైల్ ఫోన్లు, రూ.7 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెంటర్‌లో ఉన్న 10 మంది మహిళలను బాధితులుగా గుర్తించిన అధికారులు వారిని హోంకు తరలించారు. ఈ కేసుతో సంబంధమున్న స్పా సెంటర్ యజమానులు కాసిరెడ్డి అరుణ్ కుమార్, రాహుల్ పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

'అదాని సిమెంట్'ను వ్యతిరేకిస్తూ ఆటో జాతా

ప్రజాశక్తి- యంత్రాంగం

పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయవద్దని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ఆటో జాతాలు బుధవారం మల్కాపురం, పెదగంట్యాడ ప్రాంతాల్లో పర్యటించాయి. ఫ్యాక్టరీ ఏర్పాటువల్ల కలిగే నష్టాలను ప్రజలకు సిపిఎం నాయకులు వివరించారు.

ములగాడ : సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆటో ప్రచారం నిర్వహించారు. 59వ వార్డు పరిధి నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్ వద్ద ఆటో ప్రచారాన్ని ఉద్దేశించి సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, ప్రజలకు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వద్దే వద్దని ప్రజలు నిరసన తెలియజేస్తున్నా పెట్టడానికే కూటమి ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికే గంగవరం నుండి వస్తున్న నల్ల బొగ్గు వల్ల ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని తెలిపారు. సిమెంటు ఫ్యాక్టరీ పెట్టడం వల్ల ఎటువంటి ప్రమాదాలు ఉండవని కూటమి నాయకులు ప్రచారం చేయడం సరి కాదన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు స్పందించి ఈ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు ముఖ్యమంత్రి కృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆటో ప్రచార జాతాలో జోన్ నాయకులు కె.పెంటారావు, దున్న రాజేష్, జి.రామకృష్ణ, సురేష్, ఎస్‌కె.సుభాని, కిషోర్, ఎస్ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆటో జాతా పెదగంట్యాడ మీదుగా నెల్లిముక్కు, సీతానగరం, కోరాడ హౌసింగ్ బోర్డు, బర్మా కాలనీ, బిసి గేట్ ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు నమ్మి రమణ మాట్లాడుతూ, అదాని అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటును కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదాని కోసం 10 లక్షల మంది ప్రజలు ప్రాణాలు బలి చేయొద్దని కోరారు.

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ గాజువాక పరిధి అక్కిరెడ్డిపాలెం, విశ్వేశ్వరయ్య నగర్, మార్కెట్ రోడ్, శ్రీనగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో ఆటో జాతా సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రాంబాబు, ఎల్.బంగారునాయుడు, ఎ.లోకేష్, మహేష్, లక్ష్మి పాల్గొన్నారు.



పెదగంట్యాడలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు



విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ములగాడ : విశాఖలో జరిగే సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ కోరింది. ఈ మేరకు 60వ వార్డు ఎంఐజి కాలనీలో సిఐటియు నాయకులు ఇంటింటికీ వెళ్లిఆర్థిక సహాయం చేయాలని కోరుతూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, అన్ని రాష్ట్రాల నుండి కార్మిక వర్గ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న నేతలు 1500 మంది హాజరవుతారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై మహా సభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలు రూపాకల్పన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్తు బి.శ్రీను, డి.రాజేష్, వై.గంగాధర్, జి.రామకృష్ణ, హేమంత్, సురేష్‌కుమార్, దుర్గారావు, ఎస్‌కె.సుభాని, ప్రశాంత్, జివిఎంసి కాంట్రాక్ట్ కార్మికులు డి.రాము, రాజు, రమణ, బి.సూరిబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ బానిసలుగా చేయడం అన్యాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : పార్టీల పేరుతో యువతను డ్రగ్స్ బానిసలుగా మార్చిన వైసిపి నాయకులపై జనసేన నాయకుడు డాక్టర్ మత్రివేముల శ్రీనివాస్ మండిపడ్డారు సీతంపేటలోని జనసేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డ్రగ్ ఫ్రీ విశాఖపట్నం కోసం విద్యాలయాలలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు దేశంకోసం త్యాగం చేసిన వారి గురించి చెప్పాలి తప్ప విద్యార్థుల భవిష్యత్తు దారి తప్పేలా వ్యవహరించరాదని చెప్పారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి డోలా

ప్రజాశక్తి-మధురవాడ : ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకొని బాగా చదివి సమాజంలో మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విద్యార్థులకు సూచించారు. రుషికొండలోని బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. లైబ్రరీ, కంప్యూటర్ రూమ్, సెమినార్ హాల్లో వసతులను పరిశీలించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. విద్యార్థుల వసతి, పాఠశాల వాతావరణం తదితర అంశాలపై వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు నివసిస్తున్న హాస్టల్‌ను పరిశీలించి, వసతులు మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టడీ సర్కిల్ చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని శుభ్రపరచి మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, జిల్లా గురుకుల పాఠశాల కో-ఆర్డినేటర్ గ్రేస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మంత్రి డోలా

డైట్‌ను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌ను విద్యాశాఖ ఆర్‌జెడి బి.విజయభాస్కర్ బుధవారం సందర్శించారు. పలు అంశాలపై సమీక్షించారు. మూడో సెమిస్టర్ మిడ్ టర్మ్ పరీక్షలను పరిశీలించి, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు, పరీక్షా కేంద్రాల వ్యవస్థ పర్యవేక్షణ వంటి అంశాలపై సమీక్షించారు. పరీక్షల నిర్వహణ మరింత మెరుగ్గా నిర్వహించాలని ప్రిన్సిపల్,అధ్యాపకులకు సూచించారు. అనంతరం ఎపి బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. బోధనా విధానం, పాఠశాల వాతావరణం తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల ప్రగతిపై ఆర్‌జెడి ఆరా

జివిఎంసి మూడో వార్డు పరిధిలోని పిఎన్ఎం హైస్కూల్‌ను బుధవారం బి.విజయభాస్కర్ సందర్శించారు. టెన్త్ విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి వారి ప్రగతి, పురోగతిని అంచనా వేశారు. నోట్ పుస్తకాలను పరిశీలించారు. సమ్మెటివ్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఏ విధంగా సంసిద్ధులు అవుతున్నదీ, సిలబస్ ఏ మేరకు పూర్తయినదీ అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశ పెట్టిన అసెస్మెంట్ పుస్తకాలను పరిశీలించారు. డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు నాగేశ్వరరావు, హెచ్ఎం తిరుమలశ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతం అసోసియేట్ ప్రొఫెసర్ పెరుమాల్ సుందరయ్య మృతి



ప్రజాశక్తి -మధురవాడ : గీతం యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య పెరుమాల్ సుందరయ్య గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ విభాగంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్'కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన సుందరయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. 2008లో ఆయన ఏయూలో పిహెచ్‌డి పూర్తి చేశారు. కంప్యూటర్ సైన్స్ రంగంలో ఆయన నిష్ణాతులుగా పేరొందారు. సుందరయ్య ఆకస్మిక మృతిపట్ల సహచర ఉద్యోగులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. పలువురు ఘనంగా నివాళు లర్పించారు.

7 నుంచి బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ ఆంధ్రప్రదేశ్ పురుషులు, మహిళల అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు విశాలాక్షినగర్‌లోని బివికె.హైస్కూల్ వేదికగా ఈ 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి తెలిపారు. ఉమ్మడి 13 జిల్లాల నుండి 350మంది క్రీడాకారులు, 30మంది రిఫరీలు, మేనేజర్లు, కోచ్‌లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జి.భూషణరావు 9966753209ను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో...


భద్రతా లోపాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భద్రతా లోపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రామస్వామి, జె.అయోధ్యరామ్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు ప్లాంట్ భద్రతపై విచారణకు, సందర్శన నిమిత్తం విచ్చేసిన ఆంధ్ర రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. శివశంకర్‌రెడ్డిని స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం సమావేశ మందిరంలో కలిసి ప్లాంట్‌లో జరుగుతున్న భద్రతా లోపాలపై చర్చించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఈ కాలంలో ప్లాంట్‌లో ఎనిమిది ఫ్యాకల్ యాక్సిడెంట్లు జరిగాయని తెలిపారు. ప్లాంట్ సముద్ర తీర ప్రాంతంలో ఉన్నందువల్ల అత్యంత వేగంగా తుప్పుపడతాయని, దీని నివారణకు తుప్పు పట్టిన పరికరాలను తొలగించడం, వాటి స్థానంలో కొత్తవి అమర్చి పెయింటింగ్ చేయడం అత్యంత ప్రధానమని వివరించారు. పెయింటింగ్ చేయమని ఎన్నిసార్లు యాజమాన్యానికి చెప్పినా కాంట్రాక్టర్ లేరని దృష్టి సారించకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. సరియైన నిర్వహణ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికుల విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంతో చర్చించిన సమయంలో ప్లాంట్‌లోని పరికరాలను, కార్మికుల ప్రాణాలకు విలువ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యు.రామస్వామి మాట్లాడుతూ, యాజమాన్యం తీసుకుంటున్న చర్యల వల్ల కార్మికుల సంఖ్య నానాటికి తగ్గుతోందని వివరించారు. కార్మికులను ఒక విభాగం నుంచి వేరొక విభాగంలోనికి మార్చిన సందర్భంలో పని భద్రతపై తగిన అవగాహనను కల్పించాల్సిన యాజమాన్యం దాన్ని విస్మరించి కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్లయిమెంట్ చేస్తున్న కార్మికులకు కనీస భద్రత కల్పించేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. దీనికి స్పందించిన శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ, మూడు రోజులు కర్మాగారంలో భద్రతపై పరిశీలిస్తామని, ఆ సమయంలో ఈ విషయాలను తమ దృష్టికి తీసుకొస్తే అధికారులు నోట్ చేసుకుంటారని తెలిపారు. సందర్శన సమయంలో గమనించే భద్రతా లోపాలను, కార్మికులు, కార్మిక నాయకులు వివరించిన లోపాలను సమన్వయపరిచి యాజమాన్యానికి తగిన సూచనలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.అప్పారావు, పుల్లారావు, టివికె.రాజు, బి.మహేష్, బిఎన్.మధుసూదన్, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, వి.ప్రసాద్, ఎంవి.రమణ, విడివి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


శివశంకర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న అయోధ్యరామ్, రామస్వామి తదితరులు

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-చోడవరం : గొర్రెలు మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ చోడవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి తహశీల్దార్ ఎ.రామారావు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపి గొర్రెల మేకల పెంపకం దారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, జిల్లా డైరెక్టర్ పి.అప్పారావు యాదవ్ మాట్లాడుతూ చోడవరం మండలం శీమునపల్లి రెవిన్యూ సర్వేనెంబర్ 207/1, ఎల్‌పి నెంబర్ 3708ఎలో 78 సెంట్లు చెరువు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపి గొర్రెల మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ రుణం, బిసి కార్పొరేషన్ సబ్సిడీతో జాయింట్‌గా రూ.2,20,000 రుణాలు ఇవ్వాలని, ఎన్‌సిడిసి రుణాలు 250 కోట్లు రూపాయలులో రెండో విడత విడుదల చేసిన 88 కోట్లును వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని కోరారు. మూడో విడత 120 కోట్లు రూపాయలు నిధులు వచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర బడ్జెట్లో గొర్రెలు మేకలు పెంపకం దారులకు ప్రత్యేక నిధులు కేటాయించి, 50 శాతం సబ్సిడీతో రూ.5లక్షలు రుణం ఇవ్వాలని కోరారు. అన్ని రకాల నాణ్యమైన టీకాలు, డీ వార్మింగ్ మందులు జీవాలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చోప్పా వెంకట అప్పారావు, పల్లా అప్పలకొండ, బొద్దాని అప్పారావు, బోర అప్పారావు, ఎదిరి బుచ్చి రాజు, బోడి వేంకటరమణ, మాజీ ఎంపిటిసి మొల్లి తాత బాబు, గొలగాని శ్రీను యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం


భాస్కర్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొవ్వూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలుర వాలీబాల్ పోటీలలో ఆడారి కుషన్ భాస్కర్ ద్వితీయ స్థానం సాధించారు. భాస్కర్ అచ్యుతాపురంలో అచ్యుత జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ మేరకు భాస్కర్‌ను అచ్యుత కళాశాల అధినేత పల్లి శేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఆర్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా పనిగిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా ఉమాధర్మ లింగేశ్వర స్వామి పనిగిరి ప్రదర్శన బుధవారం ఘనంగా జరిగింది. స్వామివారి రథయాత్ర ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సమక్షంలో ప్రారంభమైంది. ఈ రథానికి నరేంద్రపుం, మల్లవరం, ఉప్పవరం, ఎర్రవరం, చౌడపల్లి, మోసయ్యపేట తదితర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు స్వాగతం పలికారు. ఆయా గ్రామాలలో కాలినడకన ప్రదక్షణ చేస్తున్న భక్తులకు మజ్జిగ పళ్ళు బిస్కెట్లు, పులిహోర తదితర వాటిని అందజేశారు. ఎర్రవరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రథయాత్రతో పాల్గొన్న భక్తులకు వైద్య సేవలు అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

హేమగిరి సత్యనారాయణ గిరి ప్రదక్షిణ

అనకాపల్లి : కార్తీక మాసం పౌర్ణమి రోజున మొదటిసారిగా 200 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీహేమగిరి సత్యనారాయణ స్వామి దేవస్థానం కొండ తిరుగుడు మహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ హాజరు కాగా ఆయనకు ఆలయ ఈవో, ఆలయ పాలకమండలి చైర్మన్ అప్పికొండ గణేష్, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో సైబర్ చట్టాలు, సైబర్ భద్రతపై అవగాహనా సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ సేవ కేంద్రం అధ్యాపక సమన్వయకర్త ప్రొఫెసర్ రఫీత్ ఖాన్, ఉపకులపతి డాక్టర్ దాసరి సూర్యప్రకాశ్ రావు పాల్గొన్నారు.

హేమకు రమేష్ పరామర్శ

ప్రజాశక్తి-కశింకోట : ఇటీవల కొక్కిరాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలో అచ్చర్ల గ్రామానికి చెందిన హేమను బుధవారం ఎన్టీఆర్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉల్లింగల రమేష్ పరామర్శించారు. ఆమెకు పూర్తిగా వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఆంధ్ర ప్రసాద్, హేమ కుటుంబ సభ్యులు ఉన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెంకు చెందిన పాడి రైతులు పడాల తాతబాబు, చిన్ని చంద్రరావు మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం కింద రూ.2 లక్షలు చెక్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కాయల సత్యనారాయణ, పాల సంస్థ మాజీ అధ్యక్షులు గుమ్మడి నారాయణరావు, వెటర్నరీ డాక్టర్ అభిషేక్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మండలస్థాయి చెకుముకి పోటీలు


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన దేవరాపల్లి మండల విద్యార్థులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలోని కెరళీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి 'చెకుముకి' సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 13 జట్లు పాల్గొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కాశీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బండారు జస్వంత్, గండేపల్లి మధు, ఎస్‌వివిఎస్.మేఘన జట్టు ప్రథమ స్థానం, ఏ.కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో కెరళీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు కెరళీ పాఠశాల ప్రిన్సిపాల్ డి.దినేష్, తెనుగుపూడి హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ వెంకటరమణ, జెవివి నాయకులు పుట్ట నారాయణ, కొట్టన రాంబాబు, త్రినాథ్, శ్రీను, మాధవీలత పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : యలమంచిలి లైబ్రరీలో మంగళవారం జానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పరీక్షలో యలమంచిలి గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు ఎం.రిషిత, జి.హైమలత, ఎం.బేబీ ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుశీల తెలిపారు. యలమంచిలి ప్రభుత్వ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, సెయింట్ మేరీ స్కూల్, బాప్టిస్ట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వీరి నుంచి ఈ నెల 23న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థుల చొప్పున నాలుగు బృందాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెవివి కో-ఆర్డినేటర్ చేపల రాము, లైబ్రేరియన్ ఆనంద్, ఆర్.శరయ్య, పి.అప్పారావు పాల్గొన్నారు.


యలమంచిలి మండల విజేతలు

చనిపోయిన వ్యక్తి పేరుతో ఉన్న భూమి విక్రయంపై ఫిర్యాదు


వినతి పత్రం ఇస్తున్న బాధితుడు సాగర్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : చనిపోయిన వ్యక్తి పేరుపై ఉన్న తమ భూమిని వేరొకరికి అమ్మివేసిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు మళ్ల సాగర్ అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధి సిరసపల్లి గ్రామం రాజుపాలెం 93/25, 94 సర్వే నెంబర్లలో లే-అవుట్లో గల ప్లాట్ నెంబరు 15, 16, 17 గల ప్లాట్లలో 956 గజాల స్థలాన్ని 1985 మార్చి6న తన తండ్రి మళ్ల శివ వెంకటకృష్ణ పేరుపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. తండ్రి 2008 డిసెంబర్ 11న మరణించగా ఈ 956 గజాల స్థలాన్ని 2010లో అమ్మేసినట్లు లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో దస్తావేజు నెంబర్ 298/2010గా నమోదైందని పేర్కొన్నారు. చనిపోయిన మళ్ల శివ వెంకటకృష్ణను బ్రతికి ఉన్నట్లుగా చూపించి వేరొకరికి కొంత మంది వ్యక్తులు విక్రయించినట్లు తెలిపారు. అనకాపల్లి గవరపాలెంకు చెందిన పిజెఎన్ అప్పారావు అనే వ్యక్తి విశాఖపట్నం మర్రిపాలెం గ్రీన్ గార్డెన్సుకు చెందిన నెట్టెం ఉదయభాస్కరరావుకు అమ్మేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సాక్షులుగా అనకాపల్లికి చెందిన మొల్లేటి నాగమణి, అనకాపల్లి చేపలబజారుకు చెందిన కాండ్రేగుల లక్ష్మీనారాయణ, విశాఖపట్నం వడ్లపూడికి చెందిన జి.నూకరాజు ఉన్నారని పేర్కొన్నారు. దీనికి సంబంధించి డాక్యుమెంట్ రైటర్ బొగ్గారపు వెంకట గున్నాజీరావు వ్యవహరించారని, వీరంతా కలిసి మోసం చేశారని తెలిపారు. తమకు చెందిన ప్లాట్లను అక్రమంగా అమ్మేశారని, ఈ మేరకు మోసానికి పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకొని, తమ భూమిని అప్పగించాలని కోరారు.

తాచేరు వద్ద రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేట వద్ద కొట్టుకుపోయిన తాచేరు కాజ్‌వేకు మరమ్మతులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. రెండు రోజులుగా కొట్టుకుపోయిన కాజ్‌వే గొట్టాలను సరిచేసి కంకరణ నింపి జెసిబిలతో మట్టిని సరి చేశారు. బుధవారం నుండి కాజువే మీదుగా రాకపోకలు సాగించారు.

పింఛను సొమ్ము రూ.50 వేలుతో వెల్ఫేర్ అసిస్టెంట్ పరార్


పింఛను డబ్బులు ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం తాళ్లపాలెం పంచాయతీ-1 వెల్ఫేర్ అసిస్టెంట్ వర్మ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ సొమ్ము సుమారు రూ.50 వేలుతో పరారయ్యారు. ప్రతి నెల 1 నుండి 5వ తేదీ వరకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ నగదు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇస్తున్నారు. ఇక్కడ వెల్ఫేర్ అసిస్టెంట్ వర్మ, గోలగాని దేముళ్ళు, కిల్లాడ పెద దేముడు, పక్కుర్తి మాలి నాయుడు, పక్కుర్తి నూకాలమ్మ, ఐ.లక్ష్మి, పక్కుర్తి నూకి నాయుడు, చెరపాక మహాలక్ష్మి మరో కొంతమందికి పింఛను డబ్బులు ఇవ్వలేదు. ఇందల భవాని అక్టోబర్, నవంబర్ నెలల వికలాంగ పింఛన్ నగదు కూడా ఇవ్వలేదు. దీంతో వారు పంచాయతీ దగ్గర వచ్చి తమకు పింఛను నగదు ఇప్పించాలని మొరపెట్టుకున్నారు. తాను ప్రతి నెలా రూ.3వేలు డ్వాక్రా కట్టాలని, రూ.4వేలు పింఛనుతో రూ.3వేలు డ్వాక్రా కట్టి, మిగిలిన వెయ్యి రూపాయలతో టీ, టిఫిన్ తినేదానిని, ఇప్పుడు పింఛను ఇవ్వకపోవడంతో డ్వాక్రాలో తోటి మహిళలు తను ఇబ్బంది పెడుతున్నారని తనకు న్యాయం చేయాలని తాళ్లపాలెం పంచాయతీ పరిధి బంగారయ్యపేట రజక వీధికి చెందిన చెరపాక మహాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

జాబ్ మేళాతో నిరుద్యోగులకు మేలు

ప్రజాశక్తి-చోడవరం : నిరుద్యోగ యువతకు జాబ్ మేళాలో ఎంతో ఉపయోగపడతాయని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో బుధవారం స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఇప్పటికే అనేక జాబు మేళాలు నిర్వహించామని, ఎంతో యువతకులకు మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు దక్కాయని చెప్పారు. ఈ మేళాలో సుమారు 20 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు ఆంజనేయులు, ఓ.మహేష్, శివప్రసాద్, తహశీల్దారు ఎ.రామారావు, పంచాయతీ ఈవో కే శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జి మల్లు నాయుడు నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

జనవాణికి 23 అర్జీలు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : స్థానిక శాసన సభ్యులు సుందరపు విజయకుమార్ ఆదేశాలతో యలమంచిలిలో నిర్వహించిన జనవాణి గ్రీవెన్స్‌కు 23 అర్జీలు అందాయి. వీటిని మండల అభివృద్ధి అధికారి కొండలరావు స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన ఎంపిడిఓ సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కోసం పంపడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరవాడపాలెంలో వీధి లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో బుధవారం కొత్త లైట్లు వేశారు. గ్రామంలో కొన్ని లైట్లు పోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడేవారు. దీనికి స్పందించిన గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయడు వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

సత్తా చాటిన 'ప్రతిభ' విద్యార్థులు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రతిభ విద్యాలయానికి చెందిన అటల్ టింకరింగ్ ల్యాబ్ విభాగం విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటినట్లు కరెస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు ఐఐటి మద్రాస్ నిర్వహించిన "స్కూల్ కనెక్ట్ ప్రోగ్రామ్" ద్వారా అందించిన ఆన్లైన్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల అభ్యాసన అనుభవాన్ని మెరుగుపరచడం, శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఐఐటి మద్రాస్ చేపట్టబడిందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కరెస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, డైరెక్టర్ శరత్ తేజ, సర్టిఫికెట్లు అందించారు.


ప్రతిభ కనబర్చిన ప్రతిభ విద్యాలయం విద్యార్థులు వీరే..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

పుస్తక మహోత్సవానికి కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 1వ అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని సందర్శించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య కలిసి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లాలో పుస్తక పఠన సంస్కృతిని విస్తరించేందుకు, ప్రజలకు పుస్తకాలను చేరువ చేసే లక్ష్యంతో ఈ పుస్తక మహెూత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఈ ప్రయత్నాన్ని అభినందించి, పుస్తక పఠన సంస్కృతిని అభివృద్ధి చేసే దిశగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ హాస్పిటల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సూచనలు ఇచ్చారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని, సమయపాలన పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రత, సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి, ఆర్డీవో అయేషా పాల్గొన్నారు.

స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి మణికంఠ ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట : రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 26న అమరావతిలో జరుగు స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి కశింకోట మండలం ఏఎస్.పేట జెడ్‌పి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి కెఎస్ఎస్.మణికంఠ ఎంపికయ్యాడు. ఈ మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు విజేతలను నిర్ణయించడానికి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. మంగళవారం అనకాపల్లి జివిఎంసి పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో మణికంఠ ప్రథమ స్థానంలో నిలిచి మాక్ అసెంబ్లీకి ఎంపికయ్యాడు. ఈ మేరకు హెచ్ఎం ఎల్.శ్రీనివాసరావు, విద్యార్థికి గైడ్ టీచర్ ఎం.చంద్రరావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని గుడివాడ గ్రామంలో బుధవారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం జరిగింది. హెల్ప్ ఫుల్ హ్యాండ్స్ సామాజిక వారధి స్వచ్ఛంద సేవా సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నల్లపురాజు వెంకటరాజు గారు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి గుడివాడ గ్రామంతో పరిసర గ్రామాల నుండి 90 మంది కంటి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 35 మంది కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మాజీ సర్పంచ్ నల్లపురాజు వెంకటరాజు, బొట్ట వరాహాలు, రమణ మూర్తి, హెల్ప్ ఫుల్ హ్యాండ్స్ అధ్యక్షులు ఎ.రమణ, శంకర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం సబ్ స్టేషన్ పరిధిలో గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు విద్యుత్ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అచ్యుతాపురం సబ్ స్టేషన్ ఏఈ ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కొండకర్ల, రాంబిల్లి 33 కెవి ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం 33 కెవి అచ్చుతాపురం బ్రాండ్స్ బ్రాండిక్స్, లారస్ యూనిట్లలో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 7 నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి టౌన్ : 33/11 కెవి దార్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి కొత్తలి ఫీడర్ లైన్ మెయింటనెన్స్ పనులు నిమిత్తం ఈనెల 7వ తేదీన శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ములకలపల్లి, మాన్యంపాలెం, కొత్తలి, పేరంటాలపాలెం, బయ్యావరం ఏజిఎల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారుల పెత్తనం

ప్రజాశక్తి-కోటవురట్ల : ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో సబ్ రిజిస్టార్ కార్యాలయం ముందు వరసలో ఉంటుంది. ఇటువంటి కార్యాలయంలో దస్తావేజు లేఖర్ల దళారులుగా అవతారం ఎత్తి కార్యాలయంపై పెత్తనం చేస్తున్నారు. భూముల ఖరీదును బట్టి పర్సెంటేజ్ రూపంలో కూడా పలువురు దస్తావేజు లేఖరులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఎంత ఖరీదు భూమైన దస్తావేజుకు ప్రభుత్వం ధర నిర్ణయించిన ప్రకారం తీసుకోవాల్సి ఉంటుంది. అంతకు మించి ఎక్కువ వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కోటవురట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాలకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ కార్యాలయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు పెద్దగా సాగవు. ప్రధానంగా కష్టపడి సంపాదించిన వారు వివిధ అవసరాల నిమిత్తం భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు, గిఫ్ట్ డీడ్ వంటి వ్యవహారాలు అత్యధికంగా జరుగుతూ ఉంటాయి. ఇక్కడ రైతులకు అండదండగా ఉండేందుకు రైతుల సహాయార్థం గతంలో డేటా సెంటర్ ఏర్పాటు చేశారు. రైతుల క్రయవిక్రయాలకు సంబంధించి అధికారులే దస్తావేజుల రూపంలో తయారుచేసి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. కాని ఇప్పుడు అవేవీ కనిపించకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో రైతుల సహాయార్థం ఎటువంటి డేటా సెంటర్ లేకపోవడంతో దస్తావేజులేఖర్లు ఆడింది ఆటగా రైతుల నుంచి అడ్డగోలుగా దోచుకు తింటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సబ్ రిజిస్టార్‌కు, కక్షిదారులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు రిజిస్ట్రేషన్ అధికారికి ఉన్న క్యాబిన్ తొలగించారు. రైతులతో నేరుగా ముఖాముఖి కూర్చొని వివరాలు అడిగి తెలుసుకుని రిజిస్ట్రేషన్ చేసి పంపించే విధంగా ప్రభుత్వం ఆదేశించారు. తొలి రోజుల్లో అధికారికి ఉండే క్యాబిన్‌ను తొలగించారు. అయితే దస్తావేజు లేఖరులంతా రిజిస్ట్రేషన్ అధికారికి లక్షలు ఖర్చుచేసి ఎయిర్ కండిషనర్ క్యాబిన్ ఏర్పాటు చేశారు. దీంతో క్రయవిక్రయదారులు అధికారి వద్ద నిలబడి సమాధానం చెప్పవలసిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా క్రయవిక్రయాలకు వచ్చే రైతులకు కార్యాలయం వద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని పలు కోరుతున్నారు



కోటవురట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఎంపిపి ఎన్నికపై తాత్సారం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మండల పరిషత్తు నూతన అధ్యక్షుని ఎన్నికపై తీవ్ర జాప్యం జరుగుతోంది. సెప్టెంబరు 24న మెజార్టీ ఎంపిసిలు అనకాపల్లి ఆర్డీఓ ఆయేషాను, యలమంచిలి ఎంపిడిఓను కలిసి అవిశ్వాస నోటీసు ఇచ్చినప్పటి నుండి జరుగుతున్న పరిణామాలపై జనసేన నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరు 18న ఆర్డీఓ ఆయేషా ఆధ్వర్యంలో జరిగిన మండల పరిషత్ సమావేశంలో అవిశ్వాసం నెగ్గినందున బొదెపు గోవిందరావు ఎంపిపి పదవిని కోల్పోయారు. ఆ పదవిని వైస్ ఎంపిపి-1 రాజాన శేషుకు అప్పగించాల్సి ఉందన్నది పరిశీలకుల అభిప్రాయం. ఎంపిపి ఉన్నప్పుడు సమావేశాలకు హాజరు కాకలేకపోతే వైస్ ఎంపిపి ఆ బాధ్యతలు నిర్వహించాలి. వారు కూడా లేని తరుణంలో వైస్ ఎంపిపి-2, వారు కూడా లేకపోతే సీనియర్ ఎంపిటిసికి బాధ్యతలు అప్పగించడం అనేది పంచాయతీ చట్టంలో స్పష్టీకరించారు. ఇదే విషయమై స్థానిక ఎంపిడిఓ ఎ.కొండలరావును బుధవారం ప్రజాశక్తి కలిసి వివరణ కోరగా ఇది వాస్తవమేనని చెప్పారు. అయితే ఇక్కడ అవిశ్వాసం నెగ్గినందున ఎంపిపి పదవి కోల్పోయిన వ్యక్తి స్థానంలో మెజార్టీ సభ్యుల ఎంపిక మేర ఎంపిపి ఎన్నిక జరుగుతుందని, అది జెడ్పీ సిఇఓ, ఆర్డీఓల సూచనల మేర సమావేశం నిర్వహించి ఎంపిక చేయాలని, ఆ ప్రక్రియకు ఇంకా తేదీ నిర్ణయం జరగలేదని ఎంపిడిఓ వివరణ ఇచ్చారు. ఇదే విషయమై ఎంపిపి పదవి ఆశస్తున్న వైస్ ఎంపిపి-1 రాజాన శేషుని వివరణ కోరగా ఒకటి రెండు రోజుల్లో సమావేశం తేదీ నిర్ణయించే అవకాశం ఉందని తెలిపారు.

మత్స్యకారులకు తుపాన్ సహాయం అందించాలి

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని లోవ-పాలెం, ఇతర మత్స్యకార గ్రామాల ప్రజలను మొంథా తుపాన్ బాధితులుగా గుర్తించి ప్రభుత్వ అందించిన సహాయం నిత్యావసర సరుకులు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాంబిల్లి తహశీల్దారుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ మొంథా తుపాన్ వల్ల పది రోజుల పాటు మత్స్యకారులు చేపల వేటకు దూరమయ్యారని, ఆ కారణంగా మత్స్యకార గ్రామాల ప్రజలకు 50 కేజీలు బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు అందిస్తామని ప్రకటించిందని, వాటిని వెంటనే ఇవ్వాలని కోరారు. మండలంలో ఇటు మత్స్యకారులు, అటు రైతాంగం తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. శారదా నది గట్లుకు గండిపడి వేల ఎకరాల్లో వరి పంట, వందల సంఖ్యలో చేపలు, రొయ్యల చెరువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇప్పటికీ బాధిత రైతులకు నష్ట పరిహారం అందించలేదని చెప్పారు. ముంపునకు గురైన గ్రామాల్లో వరద నీరు నిల్వ ఉండటం వల్ల ఇప్పటికీ మర్రిపాలెం, రజాల, కుమ్మరపల్లి, వై.లోవ, లోవపాలెం, వాడ నరసాపురం గ్రామాలు కంపుకొడుతున్నాయని, వెంటనే బ్లీచింగ్ జల్లాలని కోరారు. కార్యక్రమంలో చెల్లూరి దేముడు, ధోని కాసియా, అప్పారావు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు వివిధ అంశాలపై అధికారులను నిలదీశారు. గవరవరం, అంకుపాలెం, జన్నవరం సర్పంచులు రాంబాబు ,అర్జున్, సన్యాసిరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు పంచాయతీ తీర్మానం లేకుండా నిర్వహిస్తున్నారని, పనులు చేసిన వివరాలు కూడా తమకు తెలియజేయలేదని ఏపీవోపై ధ్వజమెత్తారు. దీంతో ఎంపీడీవో సమాధానం ఇస్తూ ఉపాధి హామీ పనులు పంచాయతీ తీర్మానంతో పాటు గ్రామసభ ఆమోదం పెద్దలు సూచనలు, పాటించాలన్నారు. కుళాయిల ద్వారా మంచినీటి సమస్య పలు గ్రామాల్లో ఉందని, పలువురు సర్పంచులు అధికారులకు తెలియజేశారు. అంగన్వాడీల నిర్వహణ సరిగా లేదని పర్యవేక్షణ లోపంతో పిల్లలకు అందవలసిన సరుకులు సక్రమంగా అందలేదని ఐసిడిఎస్ పిఓ మంగతాయారును పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. యూరియా కొరత ఇప్పటికే విపరీతంగా ఉందని వ్యవసాయ అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో ఆంజనేయులు, తహశీల్దారు ఏ.రామారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎజిఎల్ కనెక్షన్లకు రైతుల పడుతున్న ఇబ్బందులపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఎజిఎల్ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ వినతి పత్రం అందజేశారు. అలాగే విద్యుత్ వాడకం పెరగడం వలన అనకాపల్లి నియోజకవర్గంలో పలు చోట్ల కొత్తగా 4 సబ్- స్టేషన్‌లను నిర్మించాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ కనెక్షన్ల విషయంలో వెంటనే అధికారులు చర్యలు తీసుకువాలని ఆదేశించారు.



మొక్కలు నాటుతున్న అయ్యన్న కాలేజీ విద్యార్థులు

సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మానవాళికి మేలు చేస్తున్న పచ్చని చెట్ల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకొని సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలని మాజీ జెడ్పీటీసీ కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. అయ్యన్న జూనియర్, డిగ్రీ కాలేజీల ఎన్ఎస్ఎస్ విభాగాల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదవ రోజు బుధవారం పీఓ గాడి అప్పారావు ఆధ్వర్యంలో జోగన్నపాలెం ఆంజనేయ స్వామి ఆలయం, అంగన్వాడీ కేంద్రం సమీపం తదితర ప్రాంతాలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కశిరెడ్డితో పాటు వెటరన్ జర్నలిస్ట్ కుబిరెడ్డి రాధాకృష్ణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కన్నూరు అప్పలనాయుడు, బండారు ఫణీంద్ర పాత్రుడు పాల్గొన్నారు.

ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్

ప్రజాశక్తి-పరవాడ : రోడ్డు ప్రమాదాలను తగ్గించటమే లక్ష్యంగా పరవాడ సర్కిల్ పరిధిలో మంగళవారం రాత్రి ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ పర్యవేక్షణలో లంకెలపాలెం, మరిడిమాంబ దేవాలయం, వెన్నెలపాలెం సినిమా హాల్ జంక్షన్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు, గోపికృష్ణ, వుమెన్ ఎస్ఐ మహాలక్ష్మి, ఎస్ఐ కృష్ణారావు బృందాలతో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు.

మూలపేటలో చెత్త కుండీలు ఏర్పాటు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట గ్రామంలో బుధవారం చెత్తకుండీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడం ద్వారా పారిశుధ్యం లోపిస్తుందని, అందుకే గ్రామ ప్రధాన కూడళ్ళలో ఈ కుండీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్, ఉపసర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని సైతారుపేట, వేమగిరి, సర్వసిద్ధి, జెవి.పాలెం, పేట సూదీపురం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపీడీవో బంగారి సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. రక్షిత తాగునీటి సరఫరా పనులను పర్యవేక్షించారు. సైతారుపేటలో వాటర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వసంతకుమారి, కృష్ణ, జోషీ, గిరిబాబు, రామలక్ష్మి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో జిల్లా పశువైద్యాధికారి పర్యటన

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని ఖండిపల్లి లక్కవరం గ్రామాల్లో జిల్లా పశువైద్యాధికారి బి మోహన్ రావు బుధవారం పర్యటించి పశువులను పరీక్షించడంతోపాటు రైతులకు పలు సూచనలు చేశారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పశువులు వివిధ రకాల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది సలహాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో చోడవరం పశువైద్య శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి పొట్టకొట్టొద్దు

- 53వ రోజుకు మత్స్యకారుల రిలే దీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:తమ జీవితాన్ని నాశనం చేసే బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు బుధవారం నాటికి 53వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలు సర్వనాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల వేట తప్ప, ఏ వృత్తి తమకు తెలియదన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే సముద్రం కలుషితమవుతుందని, తమకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సముద్రం కాలుష్యం బారిన పడడంతో చేపలు ఉత్పత్తి తగ్గిపోవడంతో జీవనోపాధిని కోల్పోయామన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు, కాశీ, కోదండ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మత్స్యకారులు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఖండివరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-చీడికాడ:ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని ఖండివరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చీడికాడ పి.హెచ్. సి మెడికల్ ఆఫీసర్ మురళీకృష్ణ పాల్గొని 98 మందికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు మాట్లాడుతూ, హెచ్ఐవి, సుఖ వ్యాధులు, టీబీ తదితర వ్యాధులపై అవగాహన కలిగి రక్త పరీక్షలు చేసుకోవాలని కోరారు.

గురుకులాల్లో ఉపాధ్యాయుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-నర్సీపట్నం:ఏళ్ల తరబడి గురుకులాల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిని తొలగించడం తగదని ఏపీ సర్వోస్ నెట్వర్క్ రాష్ట్ర కన్వీనర్ ఎం చిట్టయ్య అన్నారు, బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ఇంతకాలం పెట్టి చాకిరి చేయించుకుని అమానుశంగా ఉద్యోగం నుంచి తొలగించడం తగదన్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలు మానవతా దృక్పథంతో ఆలోచించి వారికి న్యాయం చేయాలన్నారు. వారిపై ఆధారపడి ఉన్న కుటుంబాలను ఎలా పోషించుకుంటారంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం పునరాలోచించి వారికి తగు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఇంటర్ విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పి.జ్యోతి ప్రకాష్‌ను ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వినోద్ బాబు అభినందించారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని విద్యా శాఖ నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్విజ్ పోటీల్లో పాయకరావుపేట నియోజకవర్గం నుండి పి జ్యోతి ప్రకాష్ ప్రతిభ కనబరిచారు.



జ్యోతి ప్రకాష్‌ను అభినందిస్తున్న వినోద్ బాబు

సూక్ష్మపోషకాల యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో డొంకాడ, గొడిచెర్ల గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గ్రామాల్లో పర్యటించి రైతులకు సూక్ష్మ పోషకాల యాజమాన్యం, వరిలో చీడపీడల నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. నేలలో వేసుకునే చీలేటెడ్ జింక్ మూడు సంవత్సరాలకు ఒక్కసారైనా ఎకరాకు 20 కిలోలు వాడడం ద్వారా, జింకు లోపం లేకుండా చేయవచ్చునన్నారు. తద్వారా రసాయన ఎరువులను కూడా సమర్థవంతంగా వినియోగించు కోవచ్చని వివరించారు. నూరు శాతం రాయితీ పై ఎంపిక చేసిన 20 మంది రైతులకు చీలేటెడ్ జింక్, పిచికారి చేసే జింక్, జింక్ సల్ఫేట్ ను పంపిణీ చేసారు. సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తుఫాను ప్రభావంతో చాలా వరకు ఆకుముడత, సుడిదోమ ఉధృతి తగ్గిందన్నారు. ఆకుముడత, కాండం తొలుచు పురుగు గమనిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.పాలకంకి దశలో ముందస్తు తెగుళ్ళ యాజమాన్యం పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రశాంతి,రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-రావికమతం:ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, ప్రీ స్కూల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి కోరారు. మండలంలో కవగుంట అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పలువురి లబ్దిదారులకు సర్పంచ్ చేతుల మీదుగా పౌష్టిక ఆహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకున్న నాడే తల్లికి, బిడ్డకు మంచి ఆరోగ్యంతో పాటు దృఢంగా ఉండడానికి ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, పలువురు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

విశాఖ రీజియన్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రావికమతం:విశాఖ రీజియన్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ సమావేశం మాంటిసోరి, సాధన స్కూల్ కరస్పాండెంట్ కొప్పాక శేషుబాబు ఆధ్వర్యంలో బుధవారం రావికమతంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపీ జేఏసీ కన్వీనర్ వివి రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ జెఎసి రికగ్నైసేడ్ పాఠశాలల బలోపేతానికి, ఆయా పాఠశాలల సమస్యల పట్ల ఎల్లప్పుడు పని చేస్తున్నామన్నారు.అనంతరం రావికమతం డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. 30 పాఠశాలల కరస్పాండెంట్స్ హాజరు అయ్యారు. నర్సీపట్నం మాంటిసోరి పాఠశాల ప్రతినిధి రాంప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో రావికమతం నవోదయ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ జె.చంద్రశేఖర పట్నాయక్‌ను రావికమతం డివిజన్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఉపాధ్యక్షునిగా రాజా (పబ్లిక్ స్కూల్ వీరనారాయణ కరస్పాండెంట్ రాజబాబు, కార్యదర్శిగా సాధన స్కూల్ రావికమతం కరస్పాండెంట్ గొర్లె అగ్నిదేవుడు, జాయింట్ సెక్రటరీగా రవి కాన్వెంట్ బుచ్చయ్యపేట కరస్పాండెంట్ సత్యనారాయణ, ట్రెజరర్ గా శ్రీ చైతన్య స్కూల్ వడ్డాది కరస్పాండెంట్ రాంబాబు, అడిషనల్ సెక్రెటరీగా ఐ.ఇ.ఎస్ స్కూల్ ఎం కోడూరు ఏం.రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సెక్రటరీ విజయ, శివరామకృష్ణ పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు



హాజరైన అధికారులు, ప్రజలు, నేతలు

పథకాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:పాతమల్లంపేట గ్రామ పంచాయతీలో ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు ప్రభుత్వ పథకాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గెడ్డం ఆనంద్, నీలాపు చంద్రరావు సచివాలయం సిబ్బంది, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



విశాఖలో అన్నదానం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం:ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 19వ ఆవిర్భావ దినోత్సవం నర్సీపట్నంలో బుధవారం టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టౌన్ సిఐ గోవిందరావు మాట్లాడుతూ, జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ రమేష్, ఫెడరేషన్ నాయకులు ఖాదర్, ఎంవి రమణ, ప్రసాద్, ఎన్ త్రిమూర్తులు, రఫీ, హమీద్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని విశాఖ నగరంలో ఘనంగా నిర్వహించారు. వన్ టౌన్‌లోని వివేకానంద అనాథ వృద్ధుల ఆశ్రమంలో యూనియన్ నేతలు వస్త్రదానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఫెడరేషన్ సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రముఖ సంఘ సేవకులు, ఎవిఎన్ బీచ్ ఆసుపత్రి అధినేత, వైద్యులు డాక్టర్ సిఎం.ఎ.జహీర్ అహ్మద్ అన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతుమహంతి నారాయణ్, జి.శ్రీనివాస్, డి.రవికుమార్, ప్రసాద్, బి.శివప్రసాద్, ఈరోతి ఈశ్వరరావు, మదన్, జగన్మోహన్ పాల్గొన్నారు.

అనకాపల్లి : ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం అనకాపల్లిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి మొక్కలు నాటి జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భీమరశెట్టి వెంకటేష్, ఛాంద్ బాషా, బి.కొండలరావు, కోరిబిల్లి గణేష్, ఎం. గంగాధర్, పి.రామారావు, వై. నాగు, సురేష్, నటరాజ్, కుమార్, జగన్నాధరావు పాల్గొన్నారు.

వినియోగదారులపై భారాలు మోపం

-రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి- అనకాపల్లి : వినియోగదారులపై అదనపు విద్యుత్ భారాలు మోపబోమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్థానిక నిదానం దొడ్డి ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ఐదున్నర కోట్ల రూపాయలతో నిర్మించనున్న నూతన భవనానికి అనకాపల్లి ఎంపి సి.ఎం.రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.1,33,000 కోట్ల రూపాయలతో గూగుల్ డేటా సెంటర్ వస్తోందని, దానికి 4,000 మెగావాట్ల అదనపు విద్యుత్ కావాల్సి ఉందని తెలిపారు. దీనిలో 80 శాతం మేరకు పర్యావరణానికి అనుకూలంగానే విద్యుత్తును వాడాలనే ఉద్దేశంతో గూగుల్ ఉందన్నారు. నక్కపల్లి వద్దరానున్న ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమకు 133 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు అవసరంకానున్నాయన్నారు. భవిష్యత్తులో పెరిగే విద్యుత్ వినియోగాలకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచనున్నామన్నారు. కార్యక్రమంలో మల్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, ఎపిఇపిడిసిఎల్ చైర్మన్, ఎమ్‌డి పృథ్వీతేజ్, జెడ్‌సి చక్రవర్తి పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఈ ఏడాది నవంబర్ నుండి విద్యుత్ వినియోగదారులకు అదనపు ఛార్జీలు తగ్గిస్తున్నామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి


మాడుగులలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

రవికుమార్ తెలిపారు. మండలంలోని చౌడువాడలో రూ.2.49 కోట్లతో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.3.65 కోట్లతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఏపీ ఈపీడీసీఎల్ ఎమ్‌డి పథ్వితేజ్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు బత్తుల తాతయ్య బాబు, స్థానిక సర్పంచ్ దాడి ఎరుకునాయుడు పాల్గొన్నారు.

మాడుగుల : ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరా అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఇంధన వనరుల శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలో కింతలి గ్రామంలో ఉప విద్యుత్ కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలో సర్పంచ్ మైచర్ల భవాని, ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల సన్యాసిరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు మాట్లాడుతూ, కింతలి, కింతలి వల్లాపురం గ్రామాలకు ఒక్కటే శ్మశాన వాటిక ఉందని, అక్కడికి విద్యుత్ లైన్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, కొత్త వాటిని వేయాలని మంత్రి దష్టికి తీసుకువెళ్లారు. పొంగలిపాక గ్రామానికి విద్యుత్ సరఫరా వమ్మలి ఉప విద్యుత్ కేంద్రం నుండి సరఫరా అవుతుందని ఎప్పటి నుండో ఆ లైన్ పొలాల్లో నుంచి వేయడంతో కొద్దిపాటి గాలులు వీచినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కింతలి ఉప విద్యుత్ కేంద్రం నుండి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న పొంగలిపాక గ్రామానికి ఇక్కడ నుండి కొత్త లైను వేసి సమస్యను పరిష్కరించాలని కోపరేటివ్ అధ్యక్షులు ఉండూరు దేముడు మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో సూపర్ సిక్స్ పథకాలలో ఐదు పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ సౌకర్యం లేక చాలా గిరిజన గ్రామాలు ఇబ్బందులు పడుతున్నారని, మరోక ఉప విద్యుత్ కేంద్రం మండలానికి మంజూరు చేయాలని కోరారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఉప విద్యుత్ కేంద్రం కూడా త్వరలో మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు, నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేష్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు శివాజీ పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

కోళ్ల ఫారాలను తరలించాలి

-పెదపాచిల గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి- రావికమతం:కోళ్ళ ఫారాలను తరలించాలంటూ మండల పరిషత్ కార్యాలయం వద్ద గర్నికం పంచాయతీ శివారు పెదపాచిల గ్రామానికి చెందిన టిడిపి, వైసిపి కూటమి ప్రజలు బుధవారం ధర్నా నిర్వహించారు. చినపాచీల, పెదపాచీల మార్గమధ్యలో గత కొంతకాలం క్రితం కోళ్ళ ఫామ్స్ ఏర్పాటు చేసుకున్నారన్నారు.. గర్నికం టిడిపి నాయకులు కేశం శెట్టి శ్రీనివాసు, పెదపాచల టిడిపి నాయకులు పోతల వరహాల రావు, తాడి సురేష్, పోలిన నాని, ఉప సర్పంచ్ పుట్ట రమణ, వార్డు మెంబర్ పోలిన చిన్న పైడి బాబు మాట్లాడుతూ, ఈ ఫారాల వ్యర్ధాలతో పెదపాచిల గ్రామస్తులకు అనేక రకాల వ్యాధులు సోకడంతోపాటు, వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యర్ధాలపైన వాలిన ఈగలు దోమలు తాము తినే ఆహార పదార్థాలపై వాలడంతో తాము అనారోగ్య పాలవుతున్నామని, తక్షణమే ఈ ఫారాలను తరలించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామికి అందజేశారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

వెలుగు ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పుత్తడిగైరం పేట పంచాయతీలో బుధవారం వెలుగు ఆధ్వర్యంలో మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ, గొలుగొండ మండలం టీడీపి పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.నాయుడు, సర్పంచ్ పత్తి సత్తిబాబు, తుమ్మగుంటా అప్పలనాయుడు వెలుగు సీఏ వరహాలరావు, 20 డ్వాక్రా గ్రూపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి-చీడికాడ:మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన 17 వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వైసిపి నేతలు విమర్శించారు. చీడికాడ వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్ కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు పిలుపుమేరకు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పరవాడ రామారావు, కె.శివ, పైడితల్లి, మహేష్, దాసు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకు తూట్లు

ప్రజాశక్తి -నర్సీపట్నం:ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, మహిళలు రాత్రి సమయంలో కూడా పని చేసే విధంగా చట్టాలు రూపొందించడం తగదని జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. నర్సీపట్నం మార్కెట్ యార్డ్‌లో ముఠా కార్మికులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ 13 గంటల పాటు ఒక వ్యక్తి పరిశ్రమల్లో పని చేస్తే అతని ఆరోగ్య పరిస్థితి ఏమిటన్నారు. మహిళలకు పట్టపగలే రక్షణ లేక అనేక అఘాయిత్యాలు అత్యాచారాలు జరుగుతుంటే రాత్రి సమయంలో ఏ విధంగా ప్రశాంతంగా పనిచేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అప్పలరాజు, పోలిశెట్టి తాతబ్బాయి, చౌదరి ముఠా నాయకులు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు దోహదపడే పుస్తకాలు చదవాలి

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి-అనకాపల్లి : సమాజ మార్పునకు దోహదపడే పుస్తకాలు చదవాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఒకటో అనకాపల్లి పుస్తక మహోత్సవం బుధవారం నాటికి ఆరో రోజుకు చేరింది. రోజు రోజుకు సందర్శకుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో పుస్తక విక్రయాలు కూడా ఊపందుకున్నాయి. శ్రీప్రగతి పాఠశాల విద్యార్థులు పుస్తక ప్రదర్శనను సందర్శించి వివిధ విభాగాల పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. అలాగే సాహిత్య వేదికలో రెండు ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించారు. 'నాకు నచ్చిన పుస్తకం-నాకు నచ్చిన కథ-నాకు నచ్చిన కవిత' అనే అంశంపై ప్రముఖ కవి సనారా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంవిఎస్.శర్మ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగబాబు, చక్రపాణి, రామ్మోహనరావు, అమరజ్యోతి, అప్పలరాజు, గ్లాన్ శాస్త్రి, ఉప్పాడ రాము, శివాజీ పాల్గొన్నారు. దాశరథి శతజయంతి సందర్భంగా గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. అజయ్, శ్రీ లలిత, సుభాషిణి దాశరథి కవితలను ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పుస్తక మహోత్సవాన్ని సందర్శించారు. ఆయన ఏర్పాట్లు, ప్రజల స్పందన చూసి ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు. తన ప్రసంగంలో నేటి ప్రపంచంలో నెలకొన్న యుద్ధ పరిస్థితులను ఒక కథతో పోల్చుతూ శాంతి, మానవతా విలువలపై ఆలోచన కలిగించే సందేశం అందించారు.



పుస్తక ప్రదర్శనను సందర్శించిన ఎంవిఎస్.శర్మ, వివిధ ప్రజా సంఘాల నాయకులు

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక ఎంపీపీ పాఠశాలలో బుధవారం యుటిఎఫ్ నూతన మండల శాఖ ఎన్నిక జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. సభ్యులు ఏకగ్రీవ తీర్మానంతో గౌరవ అధ్యక్షులుగా టి.అలివేలు, అధ్యక్షులుగా రేపాక రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా బండారు శంకర్, సహ అధ్యక్షులుగా పీల ఆశ, దాడి వెంకట రామఅప్పారావు, కోశాధికారిగా చిందాడ వెంకటరమణ, కార్యదర్శిగా అంబటి నూతన కుమార్, జిల్లా కౌన్సిలర్‌గా జోగా రాజేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధన కంటే బోధనేతర పనులు భారం ఎక్కువగా ఉన్నదని వాపోయారు. పేద పిల్లల చదువుకు దూరం కాకుండా బోధనేతర పనులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గుత్తుల సూర్య ప్రకాష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని బగులువాడలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో డీపీఎం లచ్చన్న ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన శ్రీఆంజనేయ వ్యవసాయ వనరుల కేంద్రాన్ని జనసేన నాయకులు మజ్జి అర్జునరావు బుధవారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపిఎం లచ్చన్న అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు కషాయాలు, ద్రావణాలు అందిస్తామని, పండించిన ఉత్పత్తులను పంపిణీ చేస్తామని మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యారావు, నాగేశ్వరరావు, వీర నాయుడు, రమేష్, మువ్వల అప్పారావు, ఐసిఆర్‌పిలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.